క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


సాయినాయుడును సన్మానిస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా నియమితులైన సాయినాయుడు తెలిపారు. చిన్నపాలేడులోని ఆయన స్వగృహం వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కొనతనేని మణినాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ స్టేట్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, నాయకులు జయచంద్రనాయుడు, సముద్రాల అశోక్, గురవయ్య, నాగూర్‌నాయుడు పాల్గొన్నారు.

ఆలయానికి బీరువా వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన ఏడు గంగమ్మల ఆలయానికి శనివారం సూళ్లూరుపేట సమీపంలోని మన్నారు పోలూరునకు చెందిన సూరిశెట్టిగిరిజ ముత్యాల కాంతమ్మ, గోపాలయ్య జ్ఞాపకార్థం బీరువాను అందజేశారు. ఆలయ అర్చకులు మణికంఠ స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగలోని వీధుల్లో చెత్తా చెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో తనిఖీలు


ఆలయ పరిసరాల్లో పోలీసుల తనిఖీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కశ్మీర్ ఘటన నేపథ్యంలో ఈ సోదాలు చేశారు. అందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసర ప్రాంతాలు, రైల్వేస్టేషన్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

ఆలయ స్థలంలో రక్షణ కంచె ఏర్పాటు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన స్థలాల్లో శనివారం అధికారులు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ఆలయానికి సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలోని అంబిలిస్వామి గుడి పక్కన ఉన్న ఆలయ స్థలంలో రక్షణ కంచె ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

దేశానికి ఉత్తమ నమూనాగా శ్రీసిటీ


శ్రీసిటీలో సెజ్‌ల మార్గదర్శకుల బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సెజ్ పాలసీ లక్ష్యాలకు దీటుగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా మారిందని కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జీకే.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సందర్శన చోటుచేసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. జీకే.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పెట్టుబడి, స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థను సీబీఐసీ సభ్యులు యోగేంద్రగార్గ్ కొనియాడారు. ఇంకా పర్యటన బృందంలోని గోవా మాజీ చీఫ్ సెక్రటరీ ఎంఈపీజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బీ.విజయన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి బిజోయ్ బిహారీ మోహపాత్రా, మాజీ ఐటీఎస్ అధికారి ఎల్‌బీ.సింఘాల్, సెజ్‌ల అసోచామ్ కౌన్సిల్, ఇండస్ట్రియల్ పార్కులు వేర్‌హౌసింగ్ మండలి మాజీ కోచైర్మన్ హితేంద్ర మెహతా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కనువిందు.. కైలాసకోన


జలపాతం వద్ద పర్యాటకుల సందడి

పక్షుల కిలకిలరావాలు.. ఆకాశాన్నంటే వృక్షాలు.. నిరంతరం జాలువారే జలధార చప్పుళ్లు.. కనువిందు చేసే ప్రకృతి సోయగాలు కైలాసనాథ కోన సొంతం. ఎత్తయిన కొండల నడుమ ఈ క్షేత్రం భక్తుల మనస్సు దోచేస్తోంది. సుమారు 120 అడుగుల ఎత్తు నుంచి కిందకు జాలువారే జలపాతం ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ప్రకృతి రమణీయత మధ్య కొలువైన కైలాసనాథ స్వామి సన్నిధి సందర్శకులను కట్టి పడేస్తోంది. వేసవి విడుపునకు ఈ కేంద్రం మధుర జ్ఞాపకాలను పంచుతుందనడంలో సందేహం లేదు.

- వేసవి విడుపునకు ప్రత్యేకం
- సందర్శకులను ఆకట్టుకుంటున్న జలపాతం
- నిరంతర జలధార ప్రధాన ఆకర్షణ


కైలాసనాథస్వామి

నారాయణవనం: నారాయణవనానికి 5 కిలోమీటర్ల దూరంలో కైలాసనాథకోన ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి తరలివస్తుంటారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో వందల మంది పర్యాటకులు కైలాసనాథ కోనలో సేద తీరేందుకు వస్తుంటారు. ఇక్కడి ప్రకృతి అందాలను వీక్షించి మైమరచిపోతుంటారు.

శివుడు పరవశించిన జలపాతం

నారాయణవనంలో వేంకటేశ్వర స్వామి, పద్మావతీదేవి కల్యాణ మహోత్సవానికి తరలివచ్చిన పరమశివుడు ఇక్కడి జలపాతంలో స్నానమాచరించి పరవశించాడని, తన్మయత్వంతో ధ్యానం చేశాడని వరాహ పురాణం పేర్కొంటోంది. అందుకే ఈ ప్రాంతానికి కైలాసనాథ కోనగా పేరు వచ్చిందని తెలుస్తోంది. ప్రతి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు కోనకు తరలివస్తుంటారు. కామాక్షాంబికా సమేత కైలాసనాథ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. శరన్నవరాత్రులు, మహాశివరాత్రి, కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు.

పౌర్ణమికి ఆకాశ దీపం

శివరాత్రితో పాటు పౌర్ణమి రోజుల్లో కైలాసనాథుడికి వేకువజామునే రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపిస్తుంటారు. ప్రతి పౌర్ణమి రోజున కైలాసనాథ కోన శిఖర భాగమైన ముక్కు కొండపై ఆకాశ దీపం వెలిగిస్తుంటారు.

చేరుకోవడం ఇలా...

పుత్తూరు నుంచి నాగలాపురం మార్గంలో నారాయణవనం నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ వరకు ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 2 కిలోమీటర్ల మేర నడక దారిలో కోనకు చేరుకోవచ్చు. వాహనాలపై వెళ్లే వారు అరణ్యకండ్రిగ వద్ద కోన క్రాస్ నుంచి రోడ్డు మార్గంలో 2 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసనాథ కోనకు వెళ్లవచ్చు.

అందుబాటులో సౌకర్యాలు

కైలాసనాథ కోనలో ఏపీ టూరిజం హరిత రిసార్ట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏసీ, నాన్ ఏసీ రూములను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. అలాగే కోనకు 2 కిలోమీటర్ల దూరంలో ఈశ్వర ఎస్టీ కాలనీ సమీపంలో ప్రైవేట్ రిసార్టులు ఉన్నాయి. ఆధ్యాత్మిక చింతనతో తరలివచ్చే వారికి కంచిమఠం, శివశక్తి ఆశ్రమం, శాంతి ఆశ్రమం, అర్ధనారీశ్వర ఆశ్రమాలు విడిది వసతిని కల్పిస్తాయి. పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఆశ్రమాలలో భక్తులకు అన్న ప్రసాదాల వితరణ ఉంటుంది.


ఏపీ టూరిజం హరిత రిసార్ట్


కంచి ఆశ్రమం

తొట్టంబేడు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా లత

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం సబ్ రిజిస్ట్రార్ సుధాకర్ సెలవుపై వెళ్లడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెనాలి లతకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ గా నియమించారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ సుధాకర్‌పై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలెక్టర్, రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు చేశారు. అయితే ఆయన సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో వెనాలి లతకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం


ఉపాధ్యాయులు ముద్రించిన కరపత్రం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఫొటో, మార్కులతో ప్రచురించిన కరపత్రాలను తెలుగు ఉపాధ్యాయుడు యువ శ్రీమురళి ముద్రించి పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలుపుతూ కరపత్రాలు వేసి పల్లెలలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కరపత్రాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అందరికీ ఉచిత విద్య, భోజనం, ఆత్మ రక్షణ కోసం కరాటేలో శిక్షణ, ప్రతి నెలా వైద్యపరీక్షలు వంటి అంశాలున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను కోరుతున్నారు.

వైభవంగా వార్షికోత్సవ పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీలోని శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ప్రతిమ, మండల కన్వీనర్ , ఆలయ ధర్మకర్త సుశీల్‌కుమార్‌రెడ్డి కలిసి పూజలు వైభవంగా చేశారు. శనివారం ఉదయం అర్చకులు బాలసాగరశర్మ, త్యాగరాజు గురుకుల్ ఆలయ ప్రాంగణంలో కళశాలు ప్రతిష్ఠించారు. విగ్నేశ్వరపూజ, పుణ్యావాచనం, యజమానుల గ్రామ సంకల్పం, దేవతా పూజలు, హోమం, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సాయంత్ర ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, ట్రెజరర్ శశికిరణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో సర్వదేవతా మూర్తులు


విద్యుత్ అలంకరణలో ఆలయ ప్రాంగణం

- అయిదు రోజుల వేడుకలకు అంకురార్పణ
- కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాల్లో మొదటి రోజు శనివారం ఉదయం సర్వదేవతా మూర్తులకు కోలాటాలు, బ్యాండ్ వాయిద్యాలు, మంగళ మేళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, హోమం, వాస్తుపూజ, వాస్తు సదనము, హారతి వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి యాగసాలను నిర్మించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మొదటి రోజు స్వామి వారి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, చిన్నా మునిరెడ్డి, ఏకాంబర రెడ్డి, బలరామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవులు, మురళీకష్ణ రెడ్డి, ఉమాపతి రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని వ్యవసాయ వినియోగదారులను రెండు గ్రూపులుగా విభజించి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు డీఈ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు గ్రూపు ఏ , ఉదయం 9 గంటలకు గ్రూపు బి వారికి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. శనివారం ఆయన పత్రిక ప్రకటన ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. మొత్తం మండలంలో 8 ఫీడర్లు ఉన్నాయని వాటిని ఏ, బి గ్రూపులుగా విభజించి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. గతంలో ఏ గ్రూప్ వారికి 8.30 గంటలకు, బి గ్రూప్ వారికి ఉదయం 11 గంటలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా అయ్యేదన్నారు. రైతుల నుంచి వచ్చిన విన్నపం మేరకు విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. సోమవారం నుంచి ఆ గ్రూపులో ఉన్న కరకంబాడి, గుత్తివారిపల్లి, అల్లికేశం, పిల్లపాలెం వ్యవసాయ ఫీడర్లకు ఉదయం 7 గంటల నుంచి అలాగే బి గ్రూప్‌లోని వెంకటాపురం, మల్లవరం, అత్తూరు, జీపాలెం ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని, రైతులు సమయంలోని మార్పులను గమనించాలని కోరారు. ఒక్క వారం తర్వాత రొటేషన్ పద్ధతిలో ఏ గ్రూపు.. బి గ్రూప్ గానూ, బి గ్రూప్.. ఏ గ్రూప్ గాను మార్చడం జరుగుతుందన్నారు.

28 నుంచి వేసవి శిక్షణ శిబిరం

నాగలాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 28వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్ర లేఖనం, జనరల్ నాలెడ్జ్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ మొదలగు కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని 1వ తరగతి నుంచి పదో తరగతి లోపు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పైన తెలిపిన అంశాలపై బాల, బాలికలకు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి గలవారు స్థానిక గ్రంథాలయ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

'మనపల్లె' జానపద జాతరకు ఆహ్వానం

వరదయ్యపాళెం: ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి జానపద కళాకారులకు మే నెల 9, 10 తేదీల్లో తిరుపతిలో జరిగే మనపల్లె జానపద జాతర సంబరాల్లో పాల్గొనేందుకు వరదయ్యపాళెంకు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, కవి, ఉపాధ్యాయుడు పోలూరు జగన్నాథంకు ఆహ్వానం అందింది. ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయగోపాల్‌చే ఆత్మీయ సత్కారం అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: కార్మిక దినోత్సవం (మే 1వ తేదీని) కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ డిస్కం నాయకుడు జైమునిని కోరారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. వాడవాడల ఏఐటీయూసీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి విద్యుత్ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే 4 కార్మిక చట్టాలను రద్దు చేసే వరకు పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, గోపి, శ్రీధర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరి మృతి
- నలుగురికి గాయాలు


ఘటనా స్థలంలో మునివేల్ మృతదేహం


తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

తిరుత్తణి: తిరుత్తణి సమీపంలో జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఆంధ్రాలోని నగరికి చెందిన వ్యక్తి మృతి చెందగా అతని ఇద్దరు కుమారులు, మరో బైకులో వచ్చిన వ్యక్తితో పాటూ అతనితో పాటు వెళ్లిన చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు ఆంధ్రాలోని నగరికి చెందిన మునివేల్(45) అతని కొడుకులు భరిణి(10), రూపేష్(8) ముగ్గురు శనివారం సాయంత్రం తిరుత్తణికి వచ్చి ద్విచక్ర వాహనానికి డ్యూ చెల్లించి ఇంటికి వెళ్తుండగా నాగలాపురానికి చెందిన ప్రశాంత్(35) అతని మిత్రుడి కుమారుడు అమర్‌నాథ్(10)తో కనకమ్మసత్రానికి వెళ్లారు. చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో పొన్పాడి వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మునివేల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతని ఇద్దరు కుమారులతో పాటూ మరో బైకులో వెళ్లిన ప్రశాంత్, అమర్‌నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాలాడట్లేదు శివా?



వాయులింగేశ్వరుని క్షేత్రంలో భక్తులు గాలి లేక ఉక్కపోతతో అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. శని, ఆదివారాల్లో సుమారు 35 వేల మంది భక్తులు విచ్చేసి స్వామి,అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు త్రినేత్ర అతిథిగృహం నుంచి అన్నదానం మండపం మధ్యలో అధికంగా సేదతీరుతున్నారు. అక్కడ ఎలాంటి ఫ్యాన్లు లేవు. ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో శివగోపురం సమీపంలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన షెడ్డు భక్తులకు ఉపయోకరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిపక్కనే రూ.40 లక్షలతో మరో భారీ షెడ్డు ఏర్పాటు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోతోంది. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడాల్సి వస్తోంది. – శ్రీకాళహస్తి


కనీస వసతులు లేని షెడ్లు


పనిచేయని కూలర్

పర్యాటకులపై ఉగ్రదాడి హేయం


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం దిగువ మల్లవరం గ్రామంలో జాతీయ రహదారి పైన ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన భారత పౌరులకు ఆత్మ శాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ.. మతం పేరుతో ఉగ్రవాదులు జరిపిన మారణ హోమం మానవత్వానికే కళంకమని, యాత్రికులను విచక్షణా రహితంగా కాల్చి చంపడం అత్యంత హేయమన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రెడ్డి, డాక్టర్ కోదండరామిరెడ్డి. రఫీ, షరీఫ్, మస్తాన్, లక్ష్మయ్య, చెంగారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి : కొవ్వొత్తుల ర్యాలీలో జీఎంపీ సంఘం సభ్యులు

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

శ్రీకాళహస్తి : కశ్మీర్‌లోని పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం హేయమైన చర్య అని శ్రీకాళహస్తి డివిజన్ జీఎంపీ సభ్యులు అన్నారు. శనివారం జీఎంపీ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో నిర్మూలించాలని నినాదాలు చేశారు. ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన కుటుంబాలకు ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో జీఎంపీ సభ్యులు ఏడుకొండలు, శివశంకర్, సురేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ, వీరయ్య, రాంబాబు, జ్ఞానమ్మ, మాల్యాద్రి ,చంద్రశేఖర్, భాష, ఏసీ మండల్ పాల్గొన్నారు.